TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..

మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 257 | శుక్రవారం మే 23 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# పాక్‌ను మోకాళ్ల మీద కూర్చోబెట్టాం: ప్రధాని మోదీ

- భద్రతా బలగాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని మోదీ అన్నారు.
- ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లోనే బదులిచ్చాయని పేర్కొన్నారు.
- "ఆపరేషన్ సిందూర్" విజయవంతమైందని, ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని తెలిపారు.
- "సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు" అని వ్యాఖ్యానించారు.
- పాక్‌లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఐసీయూలో ఉందని, అణుబెదిరింపులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదని స్పష్టం చేశారు.



మన భద్రతా బలగాలు పాకిస్థాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాయని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ను ఉద్దేశించి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్విస్తున్నారని రాజస్థాన్‌లోని బికనేర్‌లో మాట్లాడారు. 'సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు. ఏప్రిల్ 22న ఉగ్రదాడికి ప్రతిగా 22 నిమిషాల్లో ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం. ఉగ్రమూకలను మట్టిలో కలిపేశాం. నా సిరల్లో రక్తం కాదు సిందూరం ప్రవహిస్తోంది. పాక్‌లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ ఐసీయూలో ఉంది. అణుబెదిరింపులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదు. పేజి 2లో

## బిజెపి చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనబడుతోంది

కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి ఇందుకు నిదర్శనం
అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ ఆధునీకరణ
ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బండి సంజయ్



మిగతాది 2లో

## దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మిగతాది 2లో

## భారాస అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ



మిగతాది 2లో

# ఎమ్మెల్యేలూ.. మీ ఆలోచనేంటో చెప్పండి




జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో సీఎం మీటింగ్ పై సర్వత్రా చర్చ
లోకల్ బాడీ ఎన్నికలకు గ్రౌండ్ రిపోర్ట్ రెడీ చేస్తున్నారా
పాలనపై ఎమ్మెల్యేల అభిప్రాయం తీసుకుంటున్నారా
ఇంటెలిజెన్స్ రిపోర్టును, ఎమ్మెల్యేలతో భేటీలో వచ్చిన అంశాలను చెక్ చేసుకుంటున్నారా
తనతో భేటీ అయిన వాళ్ల పనితీరును అంచనా వేస్తున్నారా
ఇప్పటికే మూడు జిల్లాల ఎమ్మెల్యేతో భేటీ పూర్తి
చర్చనీయాంశంగా మారిన ముఖ్యమంత్రి రివ్యూలు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల వారీగా రివ్యూలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో విడివిడిగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే మూడు జిల్లాల రివ్యూలు పూర్తయ్యాయి. సమస్యలు ఏం ఉన్నాయ్.. ఏం చేద్దాం.. మీ పనితీరు ఎలా ఉంది.. ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది అంటూ ఆరా తీస్తున్నారని సమాచారం.
ఎమ్మెల్యేల ఆలోచనలేంటో చెప్పాలని కోరుతున్నారు. ఎమ్మెల్యేలకు ఉన్న ప్రజాసంబంధ అవసరాలు, బాధలు వినేందుకు తాను సిద్ధమంటున్నారు. ఇప్పటి వరకు నాగర్ కర్నూల్, మేడ్చల్ మల్కాజ్ గిరి, మెదక్ జిల్లాల ఎమ్మెల్యేలతో మాట్లాడారు.

మిగతాది 2లో

## కాళేశ్వరంపై విచారణ పూర్తయ్యాక.. నోటీసులు ఇవ్వడమేంటి?: కేటీఆర్

కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తెలుతుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు.



మిగతాది 2లో

# సంపాదకీయం

## గూఢచర్యం జాడలివిగో!

గూఢచర్యానికి నిర్దిష్టమైన రూపురేఖలుండవు. దాన్ని సకాలంలో గుర్తించటం, కట్టడి చేయటం ఆషామాషీ కాదు. మన వేషభాషలతోనేవుంటూ, నిత్యం మనతో సన్నిహితంగా మెలగుతూ ప్రాణ ప్రదమైన మన రహస్యాలను బయటికి చేరేసేవారిని ఆనవాలు కట్టడం అంత సులభం కూడా కాదు. పహల్‌గామ్‌లో గత నెల 22న అమాయక పౌరులు 26 మందిని ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నాక మన త్రివిధ దళాలు పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వ హించి దాదాపు వందమందిని మట్టుబెట్టాయి. సింధూ నదీజలాల ఒప్పందంనుంచి వెనక్కి రాదల్చుకున్నట్టు ప్రకటించటంతోసహా అనేక అంశాల్లో పాకిస్తాన్‌కు ఇన్ని దశాబ్దాలుగా అందుతున్న ప్రయోజనాలను మన దేశం నిలుపుచేసింది. దానికి అనుబంధంగా దేశంలో అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధాలు సాగటం, పహల్‌గామ్‌లో భద్రతాలోపాలపై ప్రశ్నించినవారినీ, జవాబుదారీ తనాన్ని కోరినవారినీ ఉగ్రవాద సమర్థకులుగా ముద్రేయటం మొదలైంది. ఇది అవాంఛనీయమైన పరిణామం. ఈ నేపథ్యంలో నిఘానేత్రాల కళ్లుగప్పి కీలకమైన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరేస్తున్న 11 మందిని గుర్తించి అరెస్టు చేయటం కీలక మలుపు. అరెస్టయినవారిలో చాలామంది మధ్యతరగతి యువత. వారిలో జ్యోతి మల్హోత్రా అనే యువతి పాకిస్తాన్ గూఢచారి సంస్థలకు కీలకమైన సమా చారం అందించిందన్నది పోలీసుల అభియోగం. సామాజిక మాధ్యమాల సందడి పెరిగాక ఒక కొత్త తరం బయల్దేరింది. విచక్షణా జ్ఞానం లోపించటం, లోతైన సమాచారం లేకుండానే దేనిపైన అయినా అభిప్రాయాలు ఏర్పర్చుకోవటం, ఆధారాలున్నాయా లేదా అనేదాంతో నిమిత్తం లేకుండా సమాచారాన్ని వ్యాప్తిచేయటం, సామాజిక మాధ్యమాలపై మోజున్న యువతరానికి అలవాటుగా మారింది. సెల్‌ఫోన్‌తో దేన్నయినా చిత్రించటం, వెనకా ముందూ ఆలోచించకుండా అందరికీ చేరేయటం రివాజైంది. మనం కూడా ఏదో ఒకటి చేయాలన్న కుతూహలంతో మొదలై, అందరికన్నా ఎక్కువమంది వీక్షకుల్ని ఆకట్టుకోవటం లక్ష్యంగా మారటం, ప్రముఖ వ్యక్తిగా గుర్తింపు పొందటం, ప్రశంసలు, వాటి వెంబడే ఆదాయం మొదలవుతుంది. ఇక ఆ వ్యామోహం నుంచి వెనక్కిరావటం వాళ్లవల్ల కాదు. తాము చేసే పని ఏ మంచికి హాని చేస్తుందో, ఏ చెడును ప్రోత్సహిస్తుందో గ్రహించేంత సామర్థ్యం లేకపోవటం సామాజిక మాధ్యమాల్లో పాపులర్ అయిన అత్యధిక యువతలో కనబడే ప్రాథమిక లక్షణం. ఇలాంటివారిని ఆకట్టుకుని, వీరితో సంబంధ బాంధవ్యాలు నెరపి దగ్గరకావటం పొరుగు దేశ గూఢచార సంస్థలకు సులభం. జ్యోతి మల్హోత్రా విషయంలో జరిగింది అదే. ఆమె తగిన పత్రాలను సమర్పించి ప్రభుత్వానికి తెలిసే విధంగానే పాకిస్తాన్ వెళ్లింది. అక్కడ వేర్వేరు వ్యక్తుల్ని కలిసింది. పాకిస్తాన్ జాతీయ దినోత్సవంలో పాల్గొన్నది. అక్కడున్నవారిని పరిచయం చేసింది. వారితో మాట్లాడించింది. విదేశాలకు పోవటం, అక్కడి ప్రాంతాలను సందర్శించటం, వారితో సంభాషించటం వగైరాలు సహజంగానే సాధారణ వీక్షకులకు ఎంతో ఆసక్తి అనిపిస్తాయి. జ్యోతి నిర్వహించే యూట్యూబ్ చానెల్‌కు దాదాపు 4 లక్షలమంది చందాదార్లుండటం, ఫేస్‌బుక్‌లో 3 లక్షలమందిపైగా ఆమె ఎప్పటికప్పుడు పెట్టే వీడియోలను వీక్షించటం, ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు లక్షన్నరమంది చూడటం ఇందువల్లే. తమ అరకొర పరిజ్ఞానంతో గంటల తరబడి దేనిపైన అయినా అనర్గళంగా మాట్లాడటం నచ్చుటంవల్లే ఇన్నేసి లక్షలమంది వారిని అనుసరిస్తుంటారు. శత్రు దేశాల మధ్య యుద్ధాలు సరిహద్దుల్లోనే జరగవు. అవి కేవలం సైనికుల మధ్యే సాగవు. అనేక రూపాల్లో నిరంతరం కొనసాగుతుంటాయి. కనీసం జ్యోతి ప్రభుత్వానికి తెలిసేవిధంగా పాకిస్తాన్ వెళ్లింది. కానీ చడీచప్పుడూ లేకుండానే శత్రుదేశానికి అత్యంత కీలకమైన సమాచారాన్ని చేరేసేవారుంటారు. పాకిస్తాన్ హైకమిషన్‌లో ఇటీవల వరకూ పనిచేసి బహిష్కరణకు గురైన డానిష్ అనే ఉద్యోగి అడిగిన సమాచారమంతా ఆమె అందించిందని నిఘా వర్గాలంటున్నాయి. ఆ పని చేయటం పర్యవసానంగా తోటి పౌరులే ప్రమాదాల్లో చిక్కుకుంటారని, అది దేశద్రోహమని వారికి అనిపించదు. డబ్బుకు ఆశపడటం ఒక్కటే ఇలాంటి కార్యకలాపాలకు కారణం అనుకోవటానికి లేదు. వేరే దేశానికి చెందినవారు వీడియోలను చూడటం, పొగడ్తలు గుప్పించటం, తమ ప్రాంతాలకొచ్చి అక్కడి విశేషాలను కూడా చూపాలని అడగటం వగైరాలు వారిని ఆకర్షిస్తాయి. తమ ఘనత అంతర్జాతీయ స్థాయికి చేరుకుందన్న భ్రమ వారిని నిలకడగా ఆలోచించనీయదు. గూఢచర్యం కేవలం అవతలి దేశాన్ని నష్టపరచటానికో, చికాకుపరచటానికో పరిమితం కాదు. వారి ఆయుధాగారాల్లో వచ్చి చేరుతున్న రక్షణ సామగ్రి సామర్థ్యం ఏమిటో, ఎక్కడెక్కడ వారి సైనిక స్థావరాలు పనిచేస్తున్నాయో తెలుసుకోవటంతోపాటు పారిశ్రామిక, ఆర్థిక, పరిశోధనారంగాల్లో ఆ దేశం ఏం చేస్తున్నదో సమాచారాన్ని సేకరిస్తుండటం గూఢచారుల పని. పహల్‌గామ్‌లో ఉగ్రదాడి తర్వాత ఎక్కడ మన వైఫల్యం వున్నదో, అందుకు కారణమేమిటో తెలుసుకునే పనిలో ప్రభుత్వం తలమునకలై వుండగా దేశభక్తి పేరిట కొందరు మత విద్వేషాలను రెచ్చగొట్ట జూశారు. ఇప్పుడు పట్టుబడినవారి నేపథ్యం గమనిస్తే ఫలానా మతంవారే దేశద్రోహానికి పాల్పడతారన్నది ఎంత బూటకమో తెలుస్తుంది. శత్రువు కీలకమైన సమాచారాన్ని ఒడుపుగా తస్కరించగలుగుతున్నాడంటే నిస్సందేహంగా అది మన వైఫల్యం. దాన్ని కప్పిపుచ్చి అసత్యాలు ప్రచారం చేయటానికి బదులు, లోపాలను

## దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ( తెలిపారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్‌లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు. దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు తెలిపారు.

"తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. యాదగిరిగుట్టకు కూడా ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం" అని కిషన్‌రెడ్డి తెలిపారు

## భారాస అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: భారాస రజతోత్సవ సభలో భాజపాపై కేసీఆర్ పరిమితంగా మాట్లాడటంతో భవిష్యత్తులో ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటారన్న ఊహాగానాలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఎల్కతుర్తి సభ అనంతరం అధినేత కేసీఆర్‌కు కవిత రాసినట్టుగా ఓ లేఖ బయటికొచ్చింది. గతంలో కవిత రాసిన లేఖల్లో ఉన్న దస్తూరితో.. ఈ లేఖలోని దస్తూరీ సరిపోలుతోంది. సభ విజయవంతమైనందుకు కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ లేఖ రాసిన కవిత.. పాజిటివ్, నెగిటివ్ ఫీడ్‌బ్యాక్ పేరిట 8 అంశాలను ప్రస్తావించారు.

పార్టీ శ్రేణులు పూర్తి ఉత్సాహంతో ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వ్యక్తిగతంగా దూషించకపోవడం చాలా మందికి నచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ గీతం గురించి ప్రస్తావిస్తారని భావించినట్టు తెలిపారు. మొత్తంగా అధినేత నుంచి మరింత పదునైన విమర్శలను పార్టీ శ్రేణులు ఆశించినట్టు లేఖలో పేర్కొన్నారు. ఇదే సమయంలో నెగిటివ్ ఫీడ్ బ్యాక్ పేరిట మరికొన్ని అంశాలను ప్రస్తావించారు. వక్ఫ్ బిల్లు, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ అంశాలను ప్రసంగంలో ప్రస్తావించలేదని అన్నారు. పాత ఇన్‌ఛార్జిలనే నియమించడంతో.. పాత పద్ధతిలోనే ఉద్యమకారులకు సదుపాయాలు కల్పించలేదన్న సమాచారం వచ్చిందని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీ-ఫామ్‌లు ఇన్‌ఛార్జిల ద్వారా కాకుండా.. అధినాయకత్వమే నేరుగా ఇవ్వాలని సూచించారు. సభా వేదికపైకి కేసీఆర్ వచ్చే వరకు మొదటి నుంచి ఉద్యమంలో ఉన్న వారితో మాట్లాడించి ఉంటే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. ధూం.. ధాం.. కార్యకర్తలను ఆకట్టుకోవడంలో విఫలమైందన్నారు. భాజపాను టార్గెట్ చేయాలని వ్యక్తిగతంగా తాను కూడా అనుకున్నానని, వారి బాధితురాలిని కాబట్టి అలా అనుకుని ఉండొచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ విఫలమైందని, భాజపా ప్రత్యామ్నాయం అవుతుందేమోనన్న ఆలోచనలు శ్రేణుల్లో ఉన్నాయని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకుండా భాజపాకు సహకరించామన్న భావనను ప్రజల్లోకి కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లిందని కవిత పేర్కొన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రకటిస్తారని.. లేదా మార్గనిర్దేశనం చేస్తారని అందరూ భావించినట్టు తెలిపారు. జడ్పీ ఛైర్మన్, ఎమ్మెల్యే స్థాయి నాయకులు కూడా చాలా మంది కేసీఆర్‌ను కలవడం లేదని బాధపడుతున్నారని పేర్కొన్న కవిత.. కొంత మందికి మాత్రమే అవకాశం ఉంటుందని భావిస్తున్నారని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండాలని, ఇప్పటికైనా ఒకటి రెండ్రోజుల పాటు పార్టీ ప్లీనరీ నిర్వహించాలని కవిత సూచించారు. ఈ విషయాలపై కాస్త సీరియస్‌గా ఆలోచించాలని తండ్రి కేసీఆర్‌ను ఎమ్మెల్సీ కవిత కోరారు. ఇంత సుదీర్ఘంగా లేఖ రాసినందుకు క్షమించాలని ఆమె పేర్కొన్నారు.


## కాళేశ్వరంపై విచారణ పూర్తయ్యాక.. నోటీసులు ఇవ్వడమేంటి?: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఒక బ్యారేజీలో 2 పగుళ్లు వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారని విమర్శించారు. మేడిగడ్డ పగుళ్లకు బహుశా కాంగ్రెస్ వాళ్లే కారణం కావొచ్చని ఆరోపించారు. వాళ్లే మేడిగడ్డకు బాంబులు పెట్టారని అనుమానం వ్యక్తం చేశారు. కమీషన్ల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే కాళేశ్వరం డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. ఘోష్ విచారణ పూర్తయిందని అని చెప్పి.. ఇప్పుడు నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు.

"సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడిలా ఉన్నారు. అప్పు పుట్టలేదని రెమో అంటారు.. రూ.లక్షా 60వేల కోట్లు రాము అప్పు చేశారు. ఉన్న డిక్లరేషన్లకే దిక్కు లేదు.. ఇప్పుడు నల్లమల డిక్లరేషన్ ఎందుకు?నెల రోజులుగా సీఎం మదిలో ఉన్నవి వరల్డ్ బ్యూటీస్, కేసీఆర్‌కు నోటీసులు. మేము కట్టిన వాటి ముందు వరల్డ్ బ్యూటీస్ ఫొటోలు దిగుతున్నారు"అని కేటీఆర్ అన్నారు.

## హైదరాబాద్‌కు 2వేల ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తాం: కేంద్రమంత్రి కుమారస్వామి




దిల్లీ: ప్రధాన మంత్రి ఈ-డ్రైవ్ పథకంకింద హైదరాబాద్‌కు 2వేల ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి కుమారస్వామి తెలిపారు. రాష్ట్రాలకు ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై కుమారస్వామి గురువారం ఓ ప్రకటన చేశారు. పీఎం ఈ-డ్రైవ్ కింద 11వేల ఈ- బస్సులు మంజూరు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. సుమారు 11వేల ఈ-బస్సులను 5 నగరాలకు కేటాయిస్తామన్నారు. వీటిలో బెంగళూరుకు 4,500, దిల్లీకి 2,800, అహ్మదాబాద్‌కు 1000, సూరత్‌కు 600 బస్సులు కేటాయిస్తామని పేర్కొన్నారు. మొత్తం 14,028 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. పీఎం ఈ-డ్రైవ్ కింద ఎలక్ట్రిక్ బస్సుల కోసం కేంద్రం రూ.10,900 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

## ఎమ్మెల్యేలూ..మీ ఆలోచనేంటో చెప్పండి

మొదటిపేజీ తరువాయి

గతంలో మాదిరి కాకుండా ఈసారి ఒక్కో ఎమ్మెల్యేతో విడివిడిగా భేటీ అయినట్టు తెలిసింది. ప్రతి ఎమ్మెల్యేతో 10 నుంచి15 నిమిషాలపాటు మాట్లాడిన సీఎం ఎమ్మెల్యేల అభిప్రాయాలను వినడంతోపాటు వారికి దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకురావాలని, కాంగ్రెస్ నుంచి గెలిచిన ప్రతి ఎమ్మెల్యే తనకు సమానమేనని, అందరికీ తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు.

### పంచాయతీ ఎన్నికల కోసమేనా

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతన్నట్టుగా కనిపిస్తోంది. ఇందులో భాగంగానే సీఎం జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారని, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నారని సమాచారం. ఈ క్రమంలోనే సర్పంచులకు ప్రభుత్వం బకాయి పడి ఉన్న బిల్లులను రిలీజ్ చేసిందని సమాచారం. రూ. 10 లక్షల లోపు ఉన్న బిల్లులను ప్రభుత్వం రిలీజ్ చేసింది.

నిన్న ఒక్క రోజే 153 కోట్ల రూపాయలు పెండింగ్ బిల్లులను ప్రభుత్వ విడుదల చేసింది. త్వరలోనే రైతు భరోసా వేసేందుకు కూడా సిద్ధమవుతోందని సమాచారం. జూన్ లో పంచాయతీ ఎన్నికల నిర్వహిస్తే ఎలా ఉంటుందనే ప్రస్తావన కూడా ఈ సందర్భంగా వచ్చినట్టు సమాచారం. మొదట పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనుందనే చర్చ ఉంది.

### సీఎం దగ్గర ఇంటెలిజెన్స్ రిపోర్ట్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో నియోజకవర్గాల వారీగా ఇంటెలిజెన్స్ రిపోర్టును తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే పలు హామీలను అమలు చేసిన దరిమిలా గ్రౌండ్ రిపోర్ట్ ఏమిటన్న అంశంపై క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలతో విడివిడిగా భేటీ అవుతూ.. స్థానిక అంశాలపై చర్చిస్తూ వాటిని పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న క్రమంలో వారి పనితీరుపైనా చర్చ జరుగుతోందని సమాచారం.

## బిజెపి చేస్తున్న అభివృద్ధి కళ్లకు కనబడుతోంది

మొదటిపేజీ తరువాయి

గతంలో బీఆర్ఎస్ సహా కొన్ని పార్టీల నాయకులు రైల్వే అభివృద్ధిపై కేవలం లేఖలు రాసి బాధ్యతను దులుపుకున్నారని, కానీ అలా కాకుండా తాము అభివృద్ధికి కట్టుబడి పనిచేశామని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు అభివృద్ధి కనిపిస్తున్న తరవాత కూడా ఇదంతా తమ వల్లే జరిగిందని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. మాటలకే పరిమితమవ్వకుండా వాస్తవిక ఫలితాలు చూపాలన్నది ప్రధాన విషయం. బుల్లెట్ దిగిందా? లేదా? అనేది ప్రజలే తేల్చాలని బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరించిన కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో ఎవరి పాలనలో అభివృద్ధి జరిగిందో కరీంనగర్ స్టేషన్ మార్పే నిదర్శనమన్నారు. అలాగే, జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను కూడా అమృత్ భారత్ పథకంలో చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 61 కిలోమీటర్ల మేర ఈ లైన్ నిర్మాణానికి సర్వే పూర్తయ్యిందని, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ కూడా సిద్ధమైందని చెప్పారు. దీని కోసం రూ.1480 కోట్ల వ్యయం అంచనా వేసినట్టు వివరించారు. త్వరలో కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్య రైలు నడిపేందుకు తనతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా లేఖలు రాశారని చెప్పారు. అయితే, రద్దీ , సాంకేతిక కారణాల వల్ల అది సాధ్యపడ లేదని, ప్రస్తుతం వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును నాలుగు సార్లు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా రూ.25 వేల కోట్ల వ్యయంతో 1350 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో భాగంగా రూ.2 వేల కోట్లతో ఆధునీకరించిన 103 స్టేషన్లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారని అన్నారు. కరీంనగర్ స్టేషన్ కూడా వాటిలో ఒకటి. రూ.27 కోట్ల వ్యయంతో జరిగిన ఆధునీకరణ పనుల తరువాత కరీంనగర్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని తెలిపారు. ఎయిర్‌పోర్టు స్థాయిలో సదుపాయాలు కలిగిన ఈ స్టేషన్‌లో లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఏసీ/నాన్‌ఏసీ వెయిటింగ్ హాల్స్, ఫుడ్ కోర్టులు, టాయిలెట్లు, సోలార్ ఎ÷-లాంట్ వంటి అనేక సదుపాయాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు సెల్ఫీలు తీసుకునే స్థాయికి ఇది చేరిందని ఆయన తెలిపారు. గత 11 ఏళ్లలో రాష్ట్రంలో 20కి పైగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని, మొత్తం 2,298 కిలోమీటర్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క తెలంగాణకే రూ.42,119 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రమే రూ.5,337 కోట్ల బ్జడెట్ కేటాయించామన్నారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను త్వరలో అమృత్ భారత్ పథకంలో చేర్చుతామని, ఉప్పల్ ఆర్వోబీ నిర్మాణంలో కూడా ఒక లైన్‌ను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. హసన్‌పర్తి-కరీంనగర్ నూతన రైల్వే మార్గానికి సంబంధించిన అన్ని చర్యలు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.

## పాక్‌ను మోకాళ్ల మీద కూర్చోబెట్టాం: ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి

పాక్‌తో ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవు. చర్చల మాట అంటూ వస్తే.. అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే. ఉగ్రదాడి జరిగితే.. పాక్ ఆర్మీ, ఆర్థికవ్యవస్థ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మనం స్పష్టంచేశాం. మన దేశానికి న్యాయంగా చెందాల్సిన నీరు ఇక పాక్‌కు ప్రవహించదు. భారత ప్రజల జోలికివస్తే.. గట్టి గుణపాఠం తప్పదు" అని రాజస్థాన్ వేదికగా హెచ్చరికలు చేశారు.

"భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీ కృషి జరుగుతోంది. ఈ దిశగా గత 11 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేశాం. భారత రైలు నెట్‌వర్క్ ఆధునీకరిస్తున్నాం. వేగం, పురోగతికి వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రతీకలు" అంటూ కేంద్ర ప్రభుత్వం చేపడుతోన్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునర్నిర్మించిన దేశ్‌నోక్ స్టేషన్‌ను ప్రారంభించారు. అలాగే బికనేర్-ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. అలాగే దేశ్‌నోక్‌లోని కర్ణిమాత ఆలయంలో పూజలు చేశారు.

# గిడ్డంగులను సందర్శించిన కలెక్టర్

**- బియ్యం నిల్వలను వేగంగా తరలించాలని ఆదేశం**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల మార్కెట్ కమిటీ గిడ్డంగులతో పాటు గుండారం శివారులోని స్టేట్ వేర్ హౌజ్ కార్పొరేషన్ కు చెందిన గిడ్డంగులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. గోడౌన్లలో బియ్యం నిల్వలు, ధాన్యం బస్తాలను భద్రపరుస్తున్న తీరును గమనించారు. ఎన్ని రైస్ మిల్లుల నుండి ఎంత పరిమాణంలో మిల్లింగ్ జరిగిన బియ్యం నిల్వలు గోడౌన్లకు చేరాయి, ఇంకా ఎన్ని నిల్వలు రావాల్సి ఉంది, వాటి నాణ్యత పరిశీలన, లాటింగ్ ప్రక్రియలను ఎలా నిర్వహిస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ, బియ్యం, ధాన్యం నిల్వలను గిడ్డంగులకు వేగవంతంగా తరలించాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున మిల్లుల వద్ద, కొనుగోలు కేంద్రాలలో బియ్యం, ధాన్యం బస్తాలు



తడిసిపోకుండా యుద్ధప్రాతిపదికన వాటిని గోడౌన్లకు తరలించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోడౌన్లలో లీకేజీలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోడింగ్, అన్లోడింగ్ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా సరిపడా సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచాలని, లారీల కొరత నెలకొనకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఆయా గిడ్డంగులలో అందుబాటులో ఉన్న స్థలం పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా చూడాలని, బియ్యం, ధాన్యం బస్తాల తరలింపు



సమయంలో వర్షాల వల్ల తడిసిపోకుండా టార్పాలిన్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. కాగా, గిడ్డంగుల వద్ద బియ్యం నిల్వలను అన్లోడింగ్ చేయించడంలో కాంట్రాక్టర్ అలసత్వ వైఖరిని గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు కాంట్రాక్టరుపై నిబంధనలకు అనుగుణంగా చర్యలకు సిఫార్సు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ సెక్రెటరీ అపర్ణ, గోడౌన్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## శ్రీ హనుమత్ జయంతి వేడుకల్లో నల్లా జై శంకర్ గౌడ్



**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) మే 22 :** మనోజవం మారుతతుల్యవేగం జితేం ద్రియం బుద్ధిమతాం వరిష్ఠం, వాతాత్మజం వానరయూ థముఖ్యం శ్రీ రామదూతం శరణం ప్రపద్యే. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిం చిన బీజేపీ ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీ నల్ల జై శంకర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హను మాన్ ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హను మాన్ భక్తి మండలి సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమా న్ భక్త మండలి అధ్యక్షులు, సభ్యులు మరియు ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు. హనుమాన్ భక్తి, ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కట్టుబడాలని నల్ల జై శంకర్ పిలుపునిచ్చారు.

## ప్రశాంతంగా కొనసాగుతున్న పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు

**కొండగట్టు (మన వెలుగు) మే 22 :** అర్ధరాత్రి సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులను, సిబ్బందిని



సమన్వయ పరుస్తూ సూచనలు చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్. కొండగట్టు పెద్ద హనుమా న్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక వాతావ రణంలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. నిన్న అర్ధరాత్రి సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారు లకు మరియు సిబ్బందికి సూచనలు చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

## 27 మంది ఆదివాసుల బూటకపు ఎన్ కౌంటర్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** నిజామాబాద్ నగరంలోని యన్. ఆర్, భవన్, కొటగల్లి, రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు భగత్ సింగ్ విగ్రహం ముందు నల్లగాడ్జీలతో నిరసన వ్యక్తం చేసారు,పౌర హక్కుల సంఘం నేత వాల్గోట్ రవీందర్ రౌండ్ టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ చత్తీస్ గడ్ లోని నారాయణపూర్ జిల్లా మూడ్ అడవుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోలీసు బలగాలు మావోయిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి సంబాల కేశవరావు, 27 మంది ఆదివాసులను బూటకపు ఎన్ కౌంటర్లో హత్య చేయడం కార్పొరేట్ కంపెనీల కోసమేనని అన్నారు.మధ్యభారతదేశంలోని అటవీ ప్రాంతంలో నిక్షిప్తమైన ఖనిజ సంపదను ఆధాని, అంబాని, స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు వందలకు పైగా ఒప్పందాలు చేసుకున్నాయని.అందుకోసం అటవీ ప్రాంతంలో నివశిస్తున్న ఆదివాసి ప్రజలను అడవినుంచి తరలించడానికి 20 వేల పోలీసు బలగాలను మొహరించి, క్యాంపులను ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయని,ఆదివాసి ప్రజల సంప్రదాయాలను, జీవన



విధానాన్ని ధ్వంసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విదానాలకు వ్యతిరేకంగా, ప్రకృతి, ఖనిజ సంపద రక్షణకై ఆదివాసులు పోరాడుతున్నందుకే ఆదివాసులను ఎన్ కౌంటర్స్ పేరుతో కాల్చంపుతున్నారని అన్నారు.ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు జలంధర్, పోతే ప్రవీణ్, మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి జి రమేష్, అన్వేష్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి వెంకన్న, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య, ఐఎఫ్టియు నాయకులు శివ, పి.డి.ఎస్. యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, జన్నారపు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి లో సిపిఐ పార్టీ 4వ మహాసభ




**మండల కార్యదర్శిగా రచ్చ కిషన్ ఏకగ్రీవ ఎన్నిక**

**హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ (మన వెలుగు) మే 22 :** మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరా నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల 4వ, మహాసభ నిర్వహించడం జరిగినది. ఈ మహాసభ రచ్చ కిషన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి, ఉమామహేష్, నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు లక్ష్మీ లు హాజరవ్వడం జరిగినది. జిల్లా సహాయ కార్యదర్శిలు దామోదర్ రెడ్డి, ఉమా మహేష్ లో మాట్లాడుతూ సిపిఐ పార్టీ పేద ప్రజల ప్రక్షాను నిలబడుతూ ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ కార్మికులను, కర్షకులను వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న,100 సంవత్సరాలు



నిండిన ఏకైక పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ అని కొనియాడారు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి చేసి వేలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత చరిత్ర కమ్యూనిస్టులది అన్నారు. భగత్ సింగ్ నగర్ గుడిసెలలో పేదల ఇళ్లపై రెవెన్యూ అధికారులు వానలకు కూలిన గుడిసెలు వాటిని మరమ్మతులు చేసుకుంటే రెవెన్యూ అధికారులు వెళ్లి వారిపై చర్యలు తీసుకుంటున్నారని అలాంటి చర్యలు మానుకోవాలని తెలియజేశారు. భూ కబ్జాదారులు చేస్తున్న కబ్జాలను చూసి చూడనట్టు వదిలేసి పేద ప్రజలు 20 సంవత్సరాల నుంచి వేసుకున్న గుడిసెలను మరమ్మత్తులు చేసుకుంటే వాటిపై చర్యలు తీసుకోవడం మానాలని కోరారు. మేడిపల్లి సిపిఐ పార్టీ మండల కార్యదర్శిగా రచ్చ కిషన్ సహాయ కార్యదర్శిగా సిహెచ్ మాధవి నాగరాజు ఎన్నుకోవడం జరిగింది. కౌన్సిల్ సభ్యులుగా జె లక్ష్మి, ప్రమీల, మహాలక్ష్మి, దండు రమేష్, మాచర్ల కనకయ్య, భూతం ఐలయ్య, రచ్చ శ్యామ్, నర్సమ్మ, ఉప్పల కొమురయ్య, బాపరాజు, దండు మదర్, భూతం నరేష్, రమతారా, లక్ష్మమ్మ, విజయ్, నాగమణి, ఎండి అన్వర్, జ్యోతి, సోమయ్య, సైదులు, తమన్నా, మాధవ్, ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం జరిగింది.

# పాక్ తో శాంతి చర్చలు, సొంత పౌరులను ఎంకౌంటర్ అనాగరికం

**- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్**

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) మే 22 :** కుత్బుల్లాపూర్ శాంతి చర్చలకు మేము సిద్ధం అని నాలుగు సార్లు ప్రభుత్వానికి చెప్పినప్పటికి, స్వంత భారత దేశ పౌర సమాజం మొత్తం శాంతి చర్చలు జరపాలని కోరుతుంటే వాటిని పెదచేవిన పెట్టి ఉగ్రవాదులను మన దేశంలోకి పంపించి భారతీయులను చంపినా వారితో శాంతి చర్చలు చెయ్యడం మోడీ కి పాక్ పై ప్రేమ భారతీయుల పై ద్వేషం కనిపిస్తుందని ఇప్పటికైనా బీజేపీ ఆర్.ఎస్.ఎస్ లో పని చేస్తున్న వారు ఆలోచించాలని కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టు లో చర్చలు ప్రారంభించాలని,ఆపరేషన్ కాగార్ను నిలిపివెయ్యాలని




నేడు జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చెయ్యడం జరిగింది. మోడీ, అమితాషా తన మిత్రులైనా ఆధాని,అంబానీలకు గుట్టలో ఉన్న ఖనిజాలను దారదత్తం చెయ్యడానికి మావో యిస్టుల పేరుతో అక్కడి గిరిజనులను ఖాళీ చేయించ డానికి, ఆపరేషన్ కాగార్ను అమలు చేస్తున్నారని పర్యా వరణం కాపాడబడాలంటే, ఆదివాసీలను రక్షించుకోవాలంటే కాగార్ను నిలిపివేయ్యాల్సి ఒదేనని అన్నారు. మావోయిస్టుల ను ఏరివేయ్యా కలరని కానీ వాటి సిద్ధాంతం అయ్యిన దోపిడీ లేని సమాజం అనే ఆశయంను తుడిచివేయ్యాలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్,జర్నలిస్ట్ వెంకట్,సిపిఐ నాయకులు దుర్గయ్య,సహదేవరెడ్డి, ప్రజా నాట్యమండలి బాబు, సామెల్, రవి, ముసలయ్య, బాబు, ఆశయ్య, సైదులు కృష్ణ, జంబూ, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి వేడుకలు




**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశానుసారంగా 22 న ఉదయం 11:00 గంటల సమయంలో కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్ ) జి. బస్వారెడ్డి ఈ కార్యక్రమానికి హజరై భాగ్యరెడ్డి ఫోటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు డి.సి.పి ( అడ్మిన్ ) మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ చిన్నప్పటి నుండి చరిత్ర, విజ్ఞానం పట్ల ఎంతో శ్రద్ధ కనబర్చేవారని, సభలు సమావేశాల సందర్భంలో హరికథలను నిర్వహించేవారని,1911 సంవత్సరంలో అంటరాని కులాల ఉద్ధరణకై మన్యసంఘాన్ని ఏర్పాటు చేశారని, ఈ మన్యసంఘం అంటరాని సాహిత్యం, హరి కథలు,ఉపన్యాసాల కులాల ప్రజల్లో ద్వారా చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించారన్నారు. దేవదాసి, జోగిని వంటి దురాచారాల నిర్మూలించడం కోసం కృషి చేశారని అన్నారు. ప్రతి ఒక్కరూ భాగ్యరెడ్డి వర్మ ఆశయాల సాధనకు కృషి చేయాలని,వారికి అన్ని రకాల సహకారాలు అందించు టకు పోలీస్ శాఖ నిరంతరం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో అదనపు డి.సి.పి (స్పెషల్ బ్రాంచ్) శ్రీనివాస్ రావ్,ఆషియా బేగం (ఏ ఓ), స్పెషల్ బ్రాంచ్ ఇన్స్ పెక్టర్ శ్రీశైలం,ఆఫీస్ సూపరింటెండెం టులు శంకర్, బషీర్, వనజ రాణీ, రిజర్వు ఇన్స్పెక్టర్స్ తిరుపతి (వెల్ఫేర్), ఐ.టి కోర్ సిబ్బంది, సి.సి.ఆర్.బి సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోమ్ గార్డ్సు సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి



**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** అకాల వర్షాలు కురుస్తున్న దృష్ట్యా వరి ధాన్యం సేకరణను మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో అకాల వర్షాలు, వరి ధాన్యం కొనుగోలు, ఖరీఫ్ సీజన్ సన్నద్ధం అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీ.ఎస్ మాట్లాడుతూ, మరో రెండు, మూడు రోజుల పాటు అకాల వర్షాలు భారీగా కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ సీజన్లో అవసరమైన విత్తనాలు, ఎరువులు ముఖ్యంగా యూరియా కొరత లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగుల వైపు ఎవరు వెళ్లకుండా భద్రతా చర్యలు చేపట్టాలని, ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలన్నారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందకుండా వారికి భరోసా కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు సమకూర్చాలని, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి నకిలీ, నిషేధిత విత్తనాలు, క్రిమి సంహారక మందులు విక్రయించకుండా చర్యలు తీసుకో వాలని తెలిపారు. జిల్లాలలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా జరగ కుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయాగౌడ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు అరవింద్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగవ్వ, డీసీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ గౌతమ్ కు వినతి పత్రం అందజేత



**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) మే 22 :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించవలసిందిగా వినతి పత్రం అందజేసారు ఈ యొక్క కార్యక్రమంలో మేడ్చల్ మాజీ శాసన సభ్యులు మల్లిపెద్ది సుధీర్ రెడ్డి మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ , కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి , కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్ , మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ , జిల్లా ఆర్టిఏ మెంబర్ తుంకుంట మున్సిపల్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మీకు సమస్యలు ఉంటే నేరుగా నా తలుపు తట్టండి...!

### 24 గంటలు మీకు అందుబాటులో ఉంటా...!!

### - ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**పినపాక (మన వెలుగు) మే 22 :** అశ్వాపురం మండలంలోని మొండికుంట గ్రామంలో నెల్లిపాక పిఏసిఎస్ లో జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మీకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా నన్ను కలవచ్చుని 24 గంటలు 360 రోజులు అందుబాటు లో ఉంటానని కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే




ప్రజా ప్రభుత్వమని ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.అనంతరం జీలుగు విత్తనాల పంపిణీని ప్రారంభించారు. పచ్చిరొట్ట పంటల వల్ల నేల నాణ్యత మెరుగవుతుందని జీలుగు విత్తనాలను 50 శాతం రాయితీతో రైతన్నలకు ప్రభుత్వం అందజేస్తుందని ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ తుక్కని మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడిఏ తాతారావు, ఏవో మహేష్ చంద్ర చటర్జీ, సీఈవో, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, మిట్టకంటి వెంకట్ రెడ్డి, తూము పెద్ద వీరరాఘవులు కొండ బత్తుల ఉపేందర్, ఓరుగంటి రమేష్, సామ కృష్ణారెడ్డి, పర్వత నరేష్,కమటం సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


## మత్తుమందు ఇంజిక్షన్లు ఇచ్చి ఆవులకు ఎత్తుకెళ్తున్న ముఠా అరెస్ట్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మత్తుమందు ఇంజిక్షన్లు ఇచ్చి ఆవులకు



ఎత్తుకెళ్తున్న ముఠా గుట్టురట్టు చేసినట్లు సీసీఎస్ ఇన్స్పెక్టర్ సురేష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై ఉండే ఆవులను మత్తు మందు ఇచ్చి ఇన్నోవాలో ఎత్తుకెళ్తున్నారనే సమాచారంతో సీసీఎస్ ఇన్స్పెక్టర్ సురేశ్ తన సిబ్బంది యాదగిరి, సుభాష్, నీలేష్, నరేశ్ లతో కలిసి నిఘా ఉంచారు.అనంతరం మహారాష్ట్రలోని దెగ్లూర్లో ఆరుగురు నిందితులు సయ్యద్ ఉమర్, సయ్యద్ అమెర్, అబ్దుల్ కలామ్, సయ్యద్ షోయబ్, సమీర్ అలీలను పట్టుకున్నారు. అనంతరం దెగ్లూర్ పోలీసులకు అప్పగించారు. నిందితులు ఇన్నోవా వాహనానికి ప్రెస్, పోలీస్ స్టిక్కర్ అతికించి అర్ధరాత్రి ఆవులు చోరీకి పాల్పడేవారు. వాహనానికి స్టిక్కర్ ఉండడంతో ఇన్నాళ్లు ఎవరికీ చిక్కలేదు. సీసీ టీవీ ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తించారు.


## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న సింగిరెడ్డి పద్మారెడ్డి దంపతులు



**హైదరాబాద్ సిటీ ఇంచార్జ్ (మన వెలుగు) మే 22 :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల వెస్ట్ భీమ్ రెడ్డి నగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు నిర్వహించినటువంటి హనుమాన్ జయంతి ఉత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటములు సమర్పించినటువంటి ఐదవ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి ఉషారాణి దంపతులు, సింగిరెడ్డి అంజిరెడ్డి సుజాత దంపతులు, మెందు ప్రభాకర్ రెడ్డి సుమలత దంపతులు, శ్రీనివాస్ లక్ష్మీబాయి దంపతులు. అదేవిధంగా దేవాలయంలో నిర్వహించబడినటువంటి లక్ష్మీ గణపతి నవగ్రహ సహిత సర్వదేవత మన్య సూక్త హోమంలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగింది.

## నిజామాబాద్ నగరంలో భారీ వర్షం విరిగిపడిన వృక్షం

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** నిజామాబాద్ నగరంలో గురువారం భారీ వర్షం కురిసింది.





దీంతో పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచింది. లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. భారీ వర్షం కారణంగా నగరంలోని పులాంగ్ చౌరస్తా సమీపంలో ఓ భారీ చెట్టు సాయంత్రం సమయంలో నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఏఎస్సై శ్రీనివాస్రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కేశవ్, సిబ్బంది ప్రసాద్, రమేశ్, ఉదయ్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను మళ్లించారు. అనంతరం జేసీబీ సహాయంతో చెట్టును తొలగింప జేశారు.

## ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ కు ఘన సన్మానం

**ఇబ్రహీంపట్నం (మన వెలుగు) మే 22 :** ఉత్తమ ఎస్.హెచ్.ఓ గా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ,డి జి పి నుండి ప్రశంస పత్రం అందుకున్న ఎస్ఐ అనిల్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు.తెలంగాణ రాష్ట్రంలో 10 ఉత్తమ పోలీస్ స్టేషన్లో ఎస్ హెచ్ ఓ లుగా ఎంపిక కాగ అందులో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ఉత్తమ ఎస్ హెచ్ ఓ గా ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ ఎంపిక కావడం గర్వకారణం అన్నారు.. క్యూఆర్ కోడ్, సిటిజన్ ఫీడ్ బ్యాక్ లో ఉత్తమ ప్రతిభ కనబరచి తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా బుధవారం ఇబ్రహీంపట్నం ఎస్ ఐ అనిల్ బెస్ట్ ఎస్ హెచ్ ఓ గా అవార్డును, క్యాష్ రివార్డును డిజిపి చేతుల మీదుగా హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో అందుకోవడం గొప్ప విషయం అని కాంగ్రెస్ పార్టీ



నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మాజీ పట్టణ అధ్యక్షులు ఖుతుబోద్దీన్ పాషా, కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కొడిమ్యాల దీపక్ రాజ్ , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నల్లూరి సాగర్,ఎన్ఎస్ యుఐ కార్యదర్శి చీమల రాజు,మాజీ ఎంపీటీసీ తిమ్మని రాములు, కనుక దినేష్ ,హరిదాసు, కోరే రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## బూటకపు ఎన్ కౌంటర్లను ఆపి శాంతి చర్చలకు పిలవాలి

### - సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** దేశంలో మావోయిస్టులను, వామపక్ష భావజాలాన్ని అంతం చేయడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా ఆపరేషన్ కగార్ చేపట్టి బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని బూటకపు ఎన్ కౌంటర్లను ఆపి శాంతి చర్చలకు పిలవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి మావోయిస్టులు చర్చలకు సిద్ధమని కేంద్ర ప్రభుత్వానికి బహిరంగంగానే తెలిపినప్పటికీ కార్పొరేట్ శక్తులకు అడవిలలోని ఖనిజ సంపదను దోచిపెట్టడానికి దుర్మార్గపు వైఖరిని ప్రదర్శిస్తూ




మావోయిస్టులతోపాటు ఆదివాసులపై బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నుకున్న మార్గాన్ని పక్కనపెట్టి చర్చలకు సిద్ధమైన మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరుతున్నామన్నారు.ఛత్తీస్గఢ్ ప్రజలకు సంఘీభావంగా నిలబడాల్సిన అవసరం ఉన్నదని ఆపరేషన్ కగార్ పై స్వతంత్ర న్యాయవిచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ప్రెస్ మీట్ లో సిపిఐ జిల్లా నాయకులు ముత్యాలు, హనుమండ్లు, రంజిత్, ఫిరోజ్ ఆలీ లు పాల్గొన్నారు.

## త్రివేణి సంఘమం సరస్వతి పుష్కరాలలో ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** తెలంగాణ దక్షిణ కాశిగా పేరొందిన కాళేశ్వరం త్రివేణి సంఘమం సరస్వతి పుష్కరాలలో ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా పుణ్య స్నానం ఆచరించిన అనంతరం ముక్తీశ్వర క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు తెలంగాణ దక్షిణ కాశిగా పేరొందిన కాళేశ్వరం గోదావరి, ప్రాణహిత నదులతో పాటు సరస్వతి నది కూడా అంతర్వాహినిగా కలిసే ఈ పవిత్ర స్థలం తెలంగాణకు ప్రత్యేకం అన్నారు. కాళేశ్వరం త్రివేణి సంఘమం వద్ద 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే సరస్వతి పుష్కరాలలో నది స్నానం ఆచరించడం వల్ల పాపాలు తొలిగి పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం అన్నారు. భారతదేశంలో ముఖ్యమైన



పండుగలలో ఇది ఒకటన్నారు. తెలంగాణ నలుమూలల నుండే కాకుండా ప్రక్క రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడం విశేషం అన్నారు. సరస్వతి పుష్కరాలకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

## జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యాక్రమ ములో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ... దళిత ఉద్యమానికి పునాదులు వేసిన ప్రముఖ సంఘ సంస్కర్త. హైదరాబాద్ సంస్థానంలో ఆయన చేసిన కృషి సామాజిక న్యాయం, విద్యా అభివృద్ధి, దురాచారాల నిర్మూలన వంటి అనేక రంగాల్లో మార్గ దర్శకంగా నిలిచిందని అన్నారు. మొదట దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్రమండలి, మన్యసంఘం, సంఘసంస్కార నాటకమండలి, అహింసా సమాజంలను స్థాపించి హైదరాబాదు ప్రాంతంలో




సంఘసంస్కరణలకై కృషిచేశాడు. ఆయన సేవలను గుర్తిస్తూ ప్రతి సంవత్సరం మే 22న ఆయన జయంతిని ఘనంగానిర్వహిస్తునామని అన్నారు. భాగ్యరెడ్డివర్మ గారి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అని ఆయన ఆశయాలను కొనసాగించడమే మన%శీ% ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్బి డిఎస్పి వెంకటరమణ, రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు, ఆర్ఎస్ఐ రమేష్ ,డిపివో ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన ఎం.భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని ప్రధాన సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ అంకిత్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అంతకుముం దు జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడు తూ, దళితుల అభ్యున్నతికి దళిత మహిళల విద్యార్జన కోసం భాగ్య రెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. భాగ్యరెడ్డి వర్మ 1906-1933 మధ్య హైదరాబాదు సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని ఆయన సేవలను కొనియాడారు. భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉంద న్నారు. మహనీయులను గౌరవిం చుకోవడంతో పాటు వారి స్ఫూర్తితో సమాజ హితం కోసం ముందుకు సాగేందుకు ఈ వేడుకలు దోహదప డతాయని అన్నారు. భాగ్యరెడ్డి వర్మ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారిణి నిర్మల, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెళ్లి రోజున మిత్రుడితో కలిసి రక్తదానం



**మెట్ పల్లి (మన వెలుగు) మే 22 :** కోరుట్ల పట్టణంలోని శ్రీ సాయి న్యూ లైఫ్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న లావణ్య అను మహిళకు డెలివరీ నిమిత్తం ఆపరేషన్ చేస్తుండగా ఎక్కువగా రక్తస్రావం కావడం వలన అత్యవసరంగా 2 యూనిట్లు ఒ పాజిటివ్ రక్తం ఎక్కించాలని డాక్టర్ చెప్పడంతో పేషెంట్ కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతూ ఎనుగందుల ఉదయ్ కుమార్ గారిని సంప్రదించగా కోరుట్ల పట్టణంలోని పిఆర్బీఎం జూనియర్ కళాశాలలో లెక్చరర్ గా విధులు నిర్వహిస్తున్న మెట్పల్లి పట్టణానికి చెందిన గోపినవేని గంగాధర్ కి సమాచారం తెలుపగ గంగాధర్ మరియు తన మిత్రుడు సాహితి మహిళ డిగ్రీ కళాశాలలో లెక్చరర్ గా విధులు నిర్వహిస్తున్న పులిమామిడి ప్రవీణ్ కుమార్ ని తీసుకొని వచ్చి రక్తదానం చెయ్యడం జరిగింది.నేడు గోపినవేని గంగాధర్ పెళ్ళి రోజు సందర్భంగా అత్యవసరంగా రక్తం ఇచ్చే అవకాశం వచ్చినందుకు తను సంతోషంగా ఉందని గంగాధర్, ప్రవీణ్ లు తెలిపారు.

## ప్రపంచ పర్యావరణ అవగాహన దినోత్సవ కార్యక్రమం

### - నిజామాబాదు రైల్వే స్టేషన్ లో వైద్యధికారిని దీప




**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) మే 22 :** నిజామాబాదు రైల్వే స్టేషన్ లో ప్రారంభ మైన ప్రపంచ పర్యావరణ అవగాహన దినోత్సవ కార్యక్రమా లు ప్రపంచం పర్యావరణ పై అవగాహనా దినోత్సవ కార్యక్రమల లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ లోని నిజామాబాదు రైల్వే స్టేషన్ లో వైద్యధికారిని దీప ఆధ్వర్యంలో లో ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భం గా పర్యావరణ పరిరక్షణకై ఉద్యోగులు మరియు ప్రయాణి కులు తమవంతు కృషి చేయాలని కోరారు. మొదటిరోజు కార్యక్రమా లలో పర్యావరణ ప్రాముఖ్యత పై రైల్వే ఉద్యోగులకు మరియు ప్రయాణికుల అవగాహన నిమిత్తం సంతకాల సేకరణ, సెల్ఫీ బూత్, ర్యాలీ, పర్యావరణ పరిరక్షణకై తాము కృషి చేస్తాము అని రైల్వే ఉద్యోగులు, మరియు ప్రయాణి కులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్ర మాలు ఈ నెల 22 వతేదీ నుండి జూన్ 5 వ తేదీ వరకు కొనసాగు తాయి అని నిజామాబాదు రైల్వే స్టేషన్ హెల్త్ ఇన్స్పెక్టర్ శ్రీ ప్రేమ సాగర్ పేర్కొన్నారు. మొదటి రోజు ప్రారంభ కార్యక్రమంలో వైద్యాధికారి దీప, స్టేషన్ మేనేజర్ సదా శివుడు, కమర్షియల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# కేన్స్.. ఆ విషయంలో నేనెంతో బాధపడుతున్నా -జాన్వీకపూర్

బాలీవుడ్ నటి జాన్వీకపూర్ తొలిసారి కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సందడి చేసిన విషయం తెలిసిందే. లేత గులాబీ వర్ణం దుస్తుల్లో ఆమె ఎర్ర తివాచీపై హొయలొలికించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రియులు ప్రతిష్ఠాత్మకంగా భావించే కేన్స్ లోకి అడుగుపెట్టడం గురించి తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తన తండ్రి బోనీకపూర్, సోదరి ఖుషీకపూర్‌తో కలిసి తాను ఈ వేడుకలకు హాజరయ్యారన్నారు. ఈ ఈవెంట్ తనకెంతో ప్రత్యేకమన్న ఆమె.. ఓ విషయంలో మాత్రం బాధపడుతున్నట్లు వెల్లడించారు. తన తల్లి, దివంగత నటి శ్రీదేవికి ఈ ప్రాంతమంటే ఎంతో ఇష్టమని గుర్తు చేసుకున్నారు."హాలీడే ఎంజాయ్ చేయడానికి అమ్మ తరచూ మమ్మల్ని ఇక్కడికి తీసుకువస్తుండేవారు. అమ్మకు కేన్స్ అంటే ఎంతో ఇష్టమైన ప్రాంతం. నాకు గుర్తున్నంతవరకూ వరుసగా నాలుగు సంవత్సరాలపాటు వేసవి సెలవులకు ఇక్కడికే వచ్చాం. ఈరోజు నేను కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తొలిసారి పాల్గొనడం నా కుటుంబానికి ఎంతో ప్రత్యేకమైన విషయం. నటిగా అమ్మ ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకుంది. ఆమెకు సంబంధించిన ప్రతి కార్యక్రమానికి నన్ను తీసుకువెళ్లేది. ఆమె విజయాలను కుటుంబమంతా కలిసి సెలబ్రేట్ చేసుకునేవాళ్లం. ఆ రోజులు మాకెప్పటికీ గుర్తుంటాయి. ఈరోజు మేమంతా మళ్లీ కేన్స్‌లోకి అడుగుపెట్టాం. నాతోపాటు నాన్న, చెల్లి కూడా వచ్చారు. అమ్మ లేకుండా ఇక్కడికి రావడం నాకెంతో బాధగా ఉంది. ఆమెను నేనెంతో మిస్ అవుతున్నా" అని జాన్వీకపూర్ చెప్పారు.

**జాన్వీని విపరీతంగా ట్రోల్ చేశారు కానీ..: దర్శకుడు వ్యాఖ్యలు**

కేన్స్‌లో తన లుక్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ.. "నా సోదరి రియా కపూర్ ఈ డ్రెస్ డిజైన్ చేసింది. లుక్ విషయంలో ఆమె చాలా క్లియర్‌గా ఉంది. తను అనుకున్నది సాధించడంలో ఎక్కడా రాజీ పడలేదు. లేత గులాబీ వర్ణం గౌనులో ఎర్ర తివాచీ పైకి అడుగుపెట్టడం మాకెంతో సంతోషాన్ని ఇచ్చింది" అని అన్నారు. రియాకపూర్ బాలీవుడ్‌లో పేరుపొందిన డిజైనర్. బీటౌన్‌లో అగ్ర తారలకు ఆమె స్టైలిస్ట్‌గా వ్యవహరిస్తుంటారు. వివాహ సమయంలో రాధిక మర్చంట్‌కు ఆమె స్టైలిస్ట్‌గా చేశారు.

# కొత్త ప్రతిభకు వేదిక దిల్ రాజు డ్రీమ్స్



ఎంతోమంది నటీనటులను, దర్శకులను, టెక్నీషియన్లను తెలుగు సినిమా ఇండస్ట్రీకి పరిచయం చేసిన దిల్ రాజు.. మరో అడుగు ముందుకేసి 'దిల్ రాజు డ్రీమ్స్' అనే సంస్థను ప్రారంభించారు. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు ఆయన ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేస్తున్నారు.ఇందులో భాగం కావాలనుకునే వారు "దిల్‌రాజు డ్రీమ్స్" అనే వెబ్ సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. ఆయన టీమ్ వారిని సంప్రదిస్తుంది. జూన్‌లో ఇది ప్రారంభం కానుంది. ప్రతిభ ఉండి కూడా చిత్రపరిశ్రమలో పరిచయాలు లేక, ఎవరిని సంప్రదించాలో తెలియక ముందుకెళ్లలేకపోతున్న వాళ్లకు ఇదొక గోల్డెన్ ఛాన్స్ అని దిల్‌రాజు తెలియజేశారు.

# అవి లేకపోతే.. మనకు మనుగడ ఉండదు – పూరి జగన్నాథ్



తేనెటీగలు లేకపోతే మానవ మనుగడ ఉండదని దర్శకుడు పూరి జగన్నాథ్ అన్నారు. ఆడ తేనెటీగలు ఏం చేస్తాయో, మగ తేనెటీగలు ఏం చేస్తాయో చెప్పారు. తన 'పూరి మ్యూజింగ్స్' లో భాగంగా హనీబీస్ గురించి పూరి జగన్నాథ్ పంచుకున్న విషయాలు ఆయన మాటల్లోనే.."తేనెటీగల గురించి చదువుతుంటే ఎన్నో ఆసక్తికర విషయాలు తెలిశాయి. వాటిది స్త్రీ ఆధిపత్యంతో నడిచే సమాజం. రాణి తేనెటీగ గుడ్లు పెడుతుంది. గూడు కట్టడం, తేనె కలెక్ట్ చేయడం, లార్వా సంరక్షణ.. ఇలా అన్నింటినీ వర్కర్ బీస్ (ఆడ తేనెటీగలు) చేస్తాయి. డ్రోన్ బీస్ (మగ తేనెటీగలు)కు పనేం ఉండదు. గూడు చుట్టూ తిరుగుతూ ఉంటాయి. తేనెటీగలు 24కి.మీ వేగంతో రోజూ 10కి.మీ. ప్రయాణిస్తాయి. ఒక్కో తేనెటీగ 5000 నుంచి 10000 పువ్వులను సందర్శిస్తుంది. ఇవి అతినీల లోహిత కిరణాలను చూడగలవు. పువ్వు చుట్టూ తిరిగి అందులో తేనె ఉందో, లేదో తెలుసుకుంటాయి. కొన్ని ఆహారాన్ని వెతుక్కుంటూ ప్రయాణం చేస్తాయి. ఎక్కడైనా అపార సంపద కనిపిస్తే.. మాటలు రావు కాబట్టి డ్యాన్స్ చేస్తూ మిగిలిన వాటికి సమాచారం అందిస్తాయి. దాన్నే వాగల్ డ్యాన్స్ అంటారు""శీతాకాలంలో వాటికి చలి ఎక్కువైందనిపిస్తే.. రెక్కలు ఆడిస్తూ వేడిని పుట్టిస్తాయి. 32 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ హీట్ జనరేట్ చేసిన అనంతరం గూడులో పడుకుంటాయి. తేనెటీగల వల్ల ప్రధానంగా పాలినేషన్ జరుగుతుంది. అదేగానీ జరగకపోతే మనం తినేందుకు పండ్లు, కూరగాయలు ఉండవు. అందుకే తేనెపట్టును చూస్తే, దాన్ని పాడుచేయకండి. మీ ఇంట్లో తేనెపట్టు కనిపిస్తే భయపడకండి. మీ ఇల్లు ఎంతగానో నచ్చడం వల్లే అవి రావొచ్చు. మీ ఇంటి పెరటిలో పురుగుల మందు వినియోగాన్ని ఆపేయండి. అలా చేస్తే వీటి జాతి అంతరించిపోతుంది. అవి లేకపోతే మనకు మనుగడ ఉండదు. మనం అన్నీ తయారు చేయగం కానీ తేనెను చేయలేం. మీ ఇంట్లో ఉండే తేనెను కొంచెం కూడా వృథా చేయొద్దు. అది ఎంతో విలువైంది. తేనెను జాగ్రత్తగా భద్రపరిస్తే ఎన్నేళ్లైనా ఉంటుంది" అని అన్నారు.



# ఇక మొదలెడదామా..

## 'ఉస్తాద్ భగత్‌సింగ్' అప్‌డేట్..

పవన్ కల్యాణ్ అభిమానులు ఎదురుచూస్తున్న సినిమాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఒకటి. హరీశ్ శంకర్ దర్శకత్వంలో రానున్న ఈ సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఎన్నో రోజులుగా ఆసక్తి కనబరుస్తున్నారు. తాజాగా వారికి గుడ్‌న్యూస్ చెప్పింది టీమ్. త్వరలోనే దీని షూటింగ్ పునఃప్రారంభం కానున్నట్లు తెలిపింది."పవన్‌కు సంబంధించిన బెస్ట్ పాత్రను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధం కండి. ఉస్తాద్ భగత్‌సింగ్' చాలా సంవత్సరాలు గుర్తుండిపోయే చిత్రం. త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. మరిన్ని అప్‌డేట్స్ కోసం వేచి ఉండండి" అంటూ పోస్టర్ విడుదల చేసింది. పవన్ కల్యాణ్‌కు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు అర్థం వచ్చేలా ఆ పోస్టర్‌ను డిజైన్ చేశారు. దీన్ని షేర్ చేసిన హరీశ్ శంకర్.. 'ఇక మొదలెడదాం..' అని క్యాప్షన్ పెట్టారు.పవన్‌కల్యాణ్ రాజకీయాల్లో బిజీగా ఉండడంతో కొన్ని నెలలు సినిమా షూటింగ్‌లకు విరామం ఇచ్చారు. ఇటీవలే తిరిగి షూటింగ్‌లలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా 'హరిహర వీరమల్లు'ను పూర్తి చేశారు. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్‌సింగ్' సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు. దీంతో ఆయన అభిమానులు సంబర పడుతున్నారు. 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ – హరీశ్ శంకర్ కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల నటిస్తున్నారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# కళ్లు బైర్లు కమ్మే కండిషన్స్: సందీప్ రెడ్డి వంగా హర్ట్.. స్పిరిట్ నుంచి దీపికా పదుకొనే అవుట్!

సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'స్పిరిట్'.ఇందులో ప్రభాస్ కు జోడిగా దీపికా పదుకునే నటిస్తున్నట్లు గతకొన్ని రోజుల నుంచి వార్తలు వస్తున్న విషయం తెలిసిందే.లేటెస్ట్ అప్డేట్ ప్రకారం.. దీపికా పదుకొనేను సందీప్ రెడ్డి వంగా తొలగించినట్లు సమాచారం. ఇందులో నటించడానికి దీపికా డిమాండ్లు కళ్లు బైర్లు కమ్మేలా ఉండటంతో సందీప్ రెడ్డి ఈ డెసిషన్ తీసుకున్నట్లు తెలుస్తోంది.ప్రభాస్ తో దీపికా పదుకొనే కలిసి పనిచేస్తారని రెబల్ ఫ్యాన్స్ ఎదురు చూస్తుండగా, ఆమె డిమాండ్లపై తలెత్తిన ఘర్షణల కారణంగా ఇకపై స్పిరిట్ లో భాగం కాదని అనేక సంస్థలు వెల్లడించాయి.

**దీపికా పదుకునే డిమాండ్స్:**

స్పిరిట్ సినిమా కోసం దీపికా పదుకునే మొదటిది, రూ.20కోట్ల రెమ్యునరేషన్ ను డిమాండ్ చేసిందని సమాచారం. మేకర్స్ కూడా అంతమొత్తం ఇవ్వడానికి



సిద్ధంగా ఉండగా.. తాను నటించడానికి మరిన్ని కండిషన్స్ పెట్టిందట.

రెండవది, రూ.20కోట్ల రెమ్యునరేషన్ తో పాటు పెద్ద మొత్తంలో షేర్‌ని డిమాండ్ చేసిందట. మూడోది, 8 గంటలు మాత్రమే సెట్ లో పనిచేయడానికి ఒప్పుకుందట. అయితే, ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ఉన్న 8 గంటల్లో అందులో 2 గంటలు జర్నీకే పోతుంది. ఇక మిగిలింది 6 గంటలు మాత్రమే. ఇలా 6 గంటలు మాత్రమే సెట్స్ లో ఉంటానని చెప్పిందట. చివరగా, తెలుగులో తన డైలాగ్స్ అందించడానికి నిరాకరించిందని, భాష తెలియదని చెప్పేసిందట. ఇక దీపిక కండీషన్స్‌కి బాగా హర్ట్ అయిన డైరెక్టర్ సందీప్ రెడ్డి.. తన స్థానంలో మరో హీరోయిన్ ను తీసుకోవడానికి వేటలో పడ్డాడట.సందీప్ రెడ్డి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై అనౌన్స్ మెంట్ తోనే అంచనాలు పెరిగిపోయాయి. 'యానిమల్' మూవీలో సందీప్ డైరెక్షన్ కి వందకి వంద మార్కులు పడ్డాయి. రణ్ బీర్ చూపించిన విధానంకి ప్రేక్షకులు ఫిదా అయ్యారు.అలాంటి ప్రభాస్ ని ఎలా చూపించబోతున్నాడనే క్యూరియాసిటీ అందరిలో పెరిగింది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. ఏక్షణమైనా ఈ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది. ఈ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రాన్ని టి సిరీస్ బ్యానర్‌పై భూషణ్ కుమార్ నిర్మిస్తున్నారు.

# సల్మాన్ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి.. అరెస్టు

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ నివాసంలోకి ఓ వ్యక్తి చొరబడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు రెండు రోజుల క్రితం జితేంద్ర కుమార్ సింగ్ అనే వ్యక్తి గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించాడని.. తాము అదుపులోకి తీసుకున్నామని తాజాగా పోలీసులు తెలిపారు. తాను సల్మాన్‌ను కలిసేందుకు ఇంట్లోకి వెళ్లాలనుకున్నానని విచారణలో అతడు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ విషయంపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. "ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో సల్మాన్ ఇంటి ముందు అనుమానాస్పదంగా తిరుగుతున్న జితేంద్రను భద్రతా సిబ్బంది గుర్తించి అతడిని అక్కడినుంచి వెళ్లిపోవాలని తెలిపింది. దీంతో ఆగ్రహానికి గురైన అతడు తన ఫోన్‌ను విసిరేశాడు. అదేరోజు సాయంత్రం మరోసారి సల్మాన్ ఇంటి వద్ద కనిపించాడు. గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో ఉంటోన్న మరో వ్యక్తి కారు వెనక నక్కి లోపలికి ప్రవేశించాడు. అదే సమయంలో విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ అతడిని అడ్డుకుంది. బాంద్రా పోలీసులకు సమాచారం అందించింది. మేము అతడిని అదుపులోకి తీసుకొని విచారించాం. తాను ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చానని.. సల్మాన్‌ఖాన్‌ను కలవాలనుకుంటున్నానని చెప్పాడు. పోలీసులు అనుమతించకపోవడంతోనే తాను కారు వెనక నక్కి లోపలికి వెళ్లానని చెప్పాడు" అని పోలీసులు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెప్పారు.గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి సల్మాన్‌ఖాన్‌కు గత కొంతకాలంగా వరుస బెదిరింపులు ఎదురవుతున్న విషయం తెలిసిందే. గతేడాది సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. దానికంటే ముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. ఇటీవల సల్మాన్‌కు బెదిరింపులు ఎక్కువైన నేపథ్యంలో ప్రభుత్వం ఆయనకు వై ప్లస్ సెక్యూరిటీని నియమించింది. భారీ భద్రత నడుమ ఆయన సినిమా షూటింగ్స్, ప్రమోషన్స్, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

